నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమల బెడద, వీధిదీపాలు, ఇతర ఏ సమస్యలు ఉన్నా జడ్సీ డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వారు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో జరిగే ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని వారు చెప్పారు.


ఓనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

మలయాళీలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మలయాళ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని నయనగార్డెన్‌లో ఓనం వేడుకలను మలయాళీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 40 ఏళ్లుగా మలయాళీలు ఇక్కడే నివాసం ఉంటున్నారని, వారంతా తెలంగాణ బిడ్డలే అని అన్నారు. కూకట్‌పల్లి, ఫతేనగర్, ఓల్డ్‌బోయినపల్లి ప్రాంతాలలో ఎంతో మంది మలయాళీలు ఎక్కువ సంఖ్యలో నివాసం ఉంటున్నారన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మలయాళీ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు సురేంద్రన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత..

మోతీనగర్‌కు చెందిన సుదర్శన్‌బాబుకు రూ.3లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. లబ్ధిదారుడికి ఆదివారం ఎమ్మెల్యే కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో చెక్కు అందజేశారు.

త్వరలో మైత్రీనగర్ సమస్యలు పరిష్కారం

- కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైత్రీనగర్ కాలనీలోని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ స్థానికులకు హామీనిచ్చారు. ఆదివారం మైత్రీనగర్‌లో కార్పొరేటర్ పర్యటించారు. వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. స్పందించిన ఆయన వెంటనే ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రోడ్ల మరమ్మతులపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, రవి, రమేశ్, ధనుంజయరావు, ముఖేశ్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

కూలిన ఇంటి గోడ.. నాలాలో పడిన సామగ్రి

అల్లాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ కూలి సామగ్రి కాల్వలో పడిన సంఘటన శనివారం రాత్రి అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్‌లో జరిగింది. నాలా ఒడ్డున ఇల్లు ఉండడం.. ఇల్లు కూలడంతో సామగ్రి నాలాలో పడిపోయాయని కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబీహా బేగం ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారులతో మాట్లాడి బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తానని హామీనిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ టీం వారు నాలాలో పడిన వస్తువులను బయటకు తీశారు. కార్పొరేటర్ వెంట అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, మల్లేష్, రాంబాబు, యోగిరాజ్ స్వామి ఉన్నారు.

హస్మత్‌పేటలో అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

ఓల్డ్‌బోయినపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పితృ అమావాస్యను పురస్కరించుకుని హస్మత్‌పేట లైన్స్ టౌన్ కాలనీ నల్లపోచమ్మ టెంపుల్ సమీపంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ నర్సింహ యాదవ్ ప్రారంభించారు. అదే విధంగా అంబేద్కర్ చౌరస్తా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలోనూ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుడు జంగయ్య, నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, లీలా, మల్లికార్జున్‌యాదవ్ పాల్గొన్నారు.


మోతీనగర్: అవంతినగర్ ఈస్ట్‌లో బతుకమ్మ సంబరాలు.. ఆడిపాడిన మహిళామణులు


బాలానగర్‌లో బతుకమ్మ వేడుకల్లో కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి


కూకట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

తీరొక్క పూల జాతర

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు.. కూకట్‌పల్లిలో ఆడిపాడిన మహిళలు


ఓల్డుబోయినపల్లి హనుమాన్‌నగర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకుడు తిరుపతి యాదవ్

కూకట్‌పల్లి జోన్ బృందం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. కూకట్‌పల్లి గ్రామంలో ఒక్క రోజు ముందే ప్రారంభం కాగా.. మిగతా ప్రాంతాలైన కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్, బాలానగర్, ఓల్డుబోయినపల్లి డివిజన్లలో ఎంగిలిపూల బతుకమ్మను ఆదివారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను అలంకరించాక సమీప దేవాలయాలు, కూడళ్లకు చేరుకుని ఆడిపాడారు. బతుకమ్మ వేడుకలతో వీధులన్నీ కళకళలాడాయి. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప ప్రాంతాల్లోని చెరువులు, కొలనుల్లో నిమజ్జనం చేశారు.


బతుకమ్మతో మహిళ


సర్దార్‌పటేల్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు


కేపీహెచ్‌బీలో శ్రీలక్ష్మి గ్రాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు


శ్రీలాపార్క్ ప్రైడ్‌లో బతుకమ్మలతో స్థానిక మహిళలు


కూకట్‌పల్లి స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటీలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు


వెంకట్రావునగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్ తదితరులు


కనకదుర్గా ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బీజేపీ కూకట్‌పల్లి కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మతో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులు


వెంకటసాయి గ్రీన్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మతో యువతి

రాజీపడేతత్వం బీజేపీది కాదు: ఎంపీ ఈటల

బాలానగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీది రాజీపడే తత్వం కాదని, బరిగీసి పోరాడడం, చెప్పింది చేసి చూపించడం మాత్రమే బీజేపీకి తెలుసునని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మాణిక్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో బీఎంఎస్ కార్మిక యూనియన్ నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన అయన మాట్లాడుతూ, బాలానగర్ చిత్తారమ్మ బస్తీ వెనుక ఉన్న ఎంటీఆర్ కంపెనీలో త్వరలో జరుగనున్న కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఎంపీ రఘునందన్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా అనే ప్రధాని మోదీ నినాదాన్ని కార్మికులు నిజం చేసి చూపిస్తున్నారన్నారు. నిరుద్యోగ సమస్యను తీర్చడానికి బడ్జెట్‌లో నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు పెట్టిన ఏకైక ప్రభుత్వం బీజేపీ అని అన్నారు. మూతపడిన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని తెరిపించి కార్మికులకు మోదీ అండగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రామ్మోహన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సలహాదారుడు శ్రీనివాస్‌రెడ్డి, రామలింగారెడ్డి, శేషగిరి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటలకు జ్ఞాపికను అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం

- 360 బాటిళ్లను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రవాణా అవుతున్న అక్రమ మద్యంపై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.14.50 లక్షల విలువైన 360 బాటిళ్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న డీటీఎఫ్ ఎక్సైజ్ సీఐ పవన్‌కుమార్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ప్రవీణ్‌కుమార్‌లు అభినందించారు. స్వాధీనం చేసుకున్న మద్యం గోవా, హరియాణా, లక్నో ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 25, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 38, దొండకాయ 35, చిక్కుడుకాయ 50, గోరుచిక్కుడు 45, దోసకాయ 18, సొరకాయ 20, పొట్లకాయ 18, కంద 45, ఎండుమిర్చి 160, అల్లం 120, వెల్లుల్లి 160, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 95, కరివేపాకు 60, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 40 పైన పేర్కొన్న ధరలు సోమవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నిధులున్నా నిర్లక్ష్యం

- పూర్తి కాని బతుకమ్మ ఏర్పాట్లు
- అధికారులపై స్థానికుల ఆగ్రహం


బతుకమ్మ ఆడే ప్రదేశంలో మొరం పోస్తున్న కార్మికులు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆడపడుచులకు ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగకు ఏర్పాట్లు పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పండుగ ప్రారంభమైన రోజు వరకు ఏర్పాట్లు పూర్తి చేయకపోవడంపై మహిళలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం రూ.73లక్షలు కేటాయించారు. ఆదివారం సాయంత్రం మహిళలు బతుకమ్మ ఆడాల్సిన ప్రాంతాల్లో మధ్యాహ్నం హడావిడిగా మొరం పోశారు. రెండు రోజుల క్రితం మొరం పోసి చదును చేసి ఉంటే ఆడేందుకు వీలుగా ఉండేది. నిమజ్జనం చేసే కొలనులకు కూడా ఆదివారం రంగులు వేశారు. బతుకమ్మ ఆడే రెండు గంటల ముందు వరకు ఆయా ప్రదేశాల్లో పనులు చేస్తున్నారంటే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9 రోజులు జరిగే బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- వృద్ధుడికి కానిస్టేబుల్ సాయం



జేఎన్‌టీయూ సిగ్నల్ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆదివారం రాత్రి పది గంటలకు ఓ ద్విచక్ర వాహనదారుడు సిగ్నల్ జంప్ చేసి ఢీకొట్టాడు. ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర రక్తస్రావమైంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న కేపీహెచ్‌బీ ట్రాఫిక్ కానిస్టేబుల్ ధనీష్ కుమార్ వెంటనే వృద్ధుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, ఆంధ్రజ్యోతి

పీఎస్ఐఓ సెంటర్‌ను పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్ (పీఎస్ఐఓసీ)ను మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. కొత్తగా ప్రవేశపెట్టిన ట్రాఫిక్ ఉల్లంఘన యాప్ పనితీరు, ఈ-చలాన్ వ్యవస్థ, ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ నుంచి క్షేత్రస్థాయిలో సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తూ తీసుకునే నిర్ణయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ సమర్థవంతంగా ఉందని, రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చేపట్టేందుకు ఇలాంటి వ్యవస్థ పనితీరు ఎంతో కీలకమని ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జంప్ చేయకుండా ఉండాలని, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.


విశ్వకర్మ భగవానుడి పూజలో పాల్గొన్న శ్రీగాయత్రి విశ్వకర్మ సంఘం సభ్యులు

ఘనంగా విశ్వకర్మ భగవానుడి నిమజ్జనం

అల్లాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ బోరబండ వివేకానందనగర్‌లో శ్రీగాయత్రి విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవానుడి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో జైదేవ్ అనే వ్యక్తి రూ.72వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

తొలి పూజకు వేళాయే..!

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో..
- ముస్తాబైన మండపాలు

ఫతేనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, ఫతేనగర్, బాలానగర్, ఓల్డుబోయినపల్లిలో అమ్మవారి విగ్రహాలు నెలకొల్పేందుకు మండపాలను ఏర్పాటు చేశారు. కొందరు కొద్ది రోజుల క్రితం ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లోనే అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తుండడంతో రోడ్లపై సందడి వాతావరణం నెలకొంది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దీక్షలు తీసుకునే వారు దీక్షలకు కావాల్సిన పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు రావడంతో దుకాణాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.

తొమ్మిది రోజులు.. తొమ్మిది పూజలు..

మొదటి రోజు సోమవారం అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అవతారంలో దర్శనమిస్తుంది. రెండో రోజు గాయత్రీదేవి అవతారంలో, మూడోరోజు అన్నపూర్ణాదేవిగా, నాలుగో రోజు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవిగా దర్శనమివ్వనున్నారు. ఐదో రోజు లలితా త్రిపురసుందరి అవతారంలో, ఆరోరోజు మహాలక్ష్మీదేవి అవతారంలో, ఏడో రోజు సరస్వతీదేవి అవతారంలో, ఎనిమిదో రోజు కనకదుర్గాదేవి, తొమ్మిదో రోజు మహిషాసుర మర్ధని దేవి అవతారంలో దర్శనమిస్తుంది.


అమ్మవారికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు


భరత్‌నగర్ కాలనీలో మండపంలో కొలువుదీరిన అమ్మవారు


బాలానగర్ హనుమాన్ టెంపుల్ వద్ద ముస్తాబైన అమ్మవారి మండపం

అమ్మవారి పూజలో పాల్గొనాలి

ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డు జవహర్ కాలనీ కాళికాదేవి, శీతలాదేవి, కనకదుర్గా ఆలయంలో దేవీ నవరాత్రుల ప్రత్యేక పూజలు ఉంటాయి. తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి రోజు ఆలయంలో దుర్గ హోమం, అమ్మవారికి పసుపు బొట్టు కార్యక్రమం ఉంటుంది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

- కాశీనాథశర్మ, ఆలయ అర్చకులు



విజయదుర్గా రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో వేడుకలు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారి 22వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్‌చౌదరి, అధ్యక్షుడు రామస్వామి, ప్రధానకార్యదర్శి కేఎస్‌వీ రామారావులు తెలిపారు. అక్టోబర్ 3న గరికపాటి నరసింహారావు, మాడుగుల నాగఫణిశర్మ, శ్రీనివాస బంగారయ్యశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు, కోలాటాలు, నృత్యాలు ఉంటాయని తెలిపారు. అదేరోజు సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. అలాగే, కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగే నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకల్లో బతుకమ్మలను తెచ్చిన ప్రతి ఒక్కరికి చీర బహుమతిగా ఇస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చెరుకు కుమారస్వామి తెలిపారు.

బతుకమ్మ శుభాకాంక్షలు



మియాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా దేవుడిని పూలతో పూజిస్తే, ఆ పూలనే పూజించే గొప్ప కార్యక్రమం బతుకమ్మ ఉత్సవాలు అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పర్వదినం అన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో జరుపుకునే గొప్ప పండుగ అన్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆడపడుచులకు ఆయన బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



ఓనం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఘనంగా ఓనం వేడుకలు

గచ్చిబౌలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో మలయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మానస్-2025 ఓనం వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓనం వేడుకలను వైభవంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మంత్రిప్రగడ సత్యనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరిదాస్, మనికోత్, కేఆర్ జయనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత..

హైదర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాసకాలనీకి చెందిన సత్తెనపల్లి షణ్ముఖచారికి మంజూరైన రూ.1.30లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి

గచ్చిబౌలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బాపూనగర్, గోపినగర్, ప్రశాంత్‌నగర్ కాలనీలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాపూనగర్‌లో పూర్తయిన సీసీరోడ్డును ప్రారంభించారు. దసరా నవరాత్రులను దృష్టిలో పెట్టుకొని దుర్గాదేవి ఆలయం వద్ద త్వరితగతిన డ్రైనేజీ పనులను పూర్తిచేయాలని అధికారులను ఫోన్‌లో కోరారు. కార్యక్రమంలో స్థానికులు రవీందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, మల్లేష్, మహేష్, ప్రవీణ్, కృష్ణ, శ్రవణ్, సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తాం

హైదర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం అంబీర్ చెరువు కట్టమీద వేడుకల ఏర్పాట్లను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మైదానాన్ని గుంతలు లేకుండా చదును చేసి, డస్టింగ్, లైటింగ్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, నరసింహులు, సిద్దయ్య, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రాజిరెడ్డి, బ్రహ్మయ్య, ఏఈ శ్రావణి, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ముస్తాబైన అమ్మవారి ఆలయాలు.. భారీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



భెల్ టౌన్‌షిప్‌లోని కనకదుర్గాదేవి ఆలయం



దసరా వేడుకలకు ముస్తాబైన గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్ రాజరాజేశ్వరీదేవి ఆలయం

భెల్‌కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భక్తులచే నిత్యం నీరాజనాలు అందుకుంటున్న కనకదుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు దశాబ్దాల చరిత్ర గల భెల్ టౌన్‌షిప్‌లోని దుర్గాదేవి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోనే అతిపెద్ద దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నేపథ్యంలో భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలకు లక్షమందికి పైగా భక్తులు హాజరవుతారని ఆలయ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలోని కనకదుర్గాదేవి కళా ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం ప్రముఖ సాహితీవేత్తలు, ఉపన్యాసకులు, అవధానులు ప్రవచనాలు వినిపిస్తారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని నిత్యం ఒక్కో అవతారంలో అలంకరించి విశేషపూజలు నిర్వహించనున్నారు. నిత్యపూజలతో పాటు అమ్మవారికి అభిషేకం, విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, ధ్వజారోహణ, అంకురార్పణ, కలశస్థాపన, హోమం తదితర పూజలు జరుగుతాయి.

రోజుకో అలంకారంలో అమ్మవారి దర్శనం..

నవరాత్రుల్లో మొదటి రోజైన సోమవారం అమ్మవారిని స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. మంగళవారం బాలత్రిపురసుందరీదేవి, బుధవారం గాయత్రీదేవి, గురువారం అన్నపూర్ణాదేవి, శుక్రవారం మహాలక్ష్మీదేవి, శనివారం లలితా త్రిపురసుందరీదేవి, ఆదివారం వారాహి(లఘు అవతారం), సోమవారం సరస్వతీ దేవి, మంగళవారం 30వ తేదీన దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవి అవతారం, అక్టోబర్ 1న మహిషాసురమర్ధిని అవతారం, విజయదశమి రోజున రాజరాజేశ్వరీదేవిగా అలంకరించనున్నారు.

వేడుకలకు సిద్ధమైన ఆలయాలు..

టౌన్‌షిప్‌లోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయం, యోగేశ్వరి అమ్మవారి ఆలయం, ఎంఐజీ కాలనీలోని రామాలయం, రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయం, భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయం, పోచమ్మతల్లి ఆలయం, పెద్దమ్మతల్లి దేవాలయం, విద్యుత్‌నగర్ కాలనీలో గాయత్రీ దేవి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎంఐజీకాలనీ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంఐజీ కాలనీ రామాలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ నక్షత్రపూజలు, దశమి రోజున రావణ దహనకాండ, సాయంత్రం కాలనీలో అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జనం జరగనున్నాయి.



మియాపూర్ విజయదుర్గా మాత ఆలయంలో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడిపాడిన మహిళలు



కేపీహెచ్‌బీలోని మలేసియన్ టౌన్‌షిప్ నార్త్ ఫేజ్‌లో కమిటీ సభ్యులు వేణుగోపాల్, పున్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా బతుకమ్మ సంబురాలు

హైటెక్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు, శారీస్ ఆఫ్ ఇండియా మేళాలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఆదివారం అర్చన మిశ్రా శిష్య బృందం కథక్ నృత్యం లో గణేశ వందన, గురు వందన, కృష్ణ వందన, తీన్తాల్, తరణ, సర్గం, చతురంగ్ అంశాలను స్వాతి, జాహ్నవి, నిహారిక, మీతు, అధిర, రుచిత, ధ్రువ, ఆనందిని, శ్రీకా, శర్వాణి, ఆకాంక్ష, సంజన, లిప్సిత, సౌందర్య తదితరులు ప్రదర్శించారు. కూచిపూడి నృత్యంలో సౌందర్య కౌశిక్ తన శిష్య బృందంచే బొమ్మ బొమ్మ త, శరణం భవ, జయ జయస్వామి, చక్కని తల్లికి, అలరులు కురియగా, జయ జయ వైష్ణవి, అంశాలను శ్రేష్ఠ తదితరులు ప్రదర్శించారు. శిల్పారామం ఆవరణలో మహిళా సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సందర్శకులతో కలిసి ఆడి పాడి అలరించారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు



శిల్పారామంలో బతుకమ్మ సంబురాలు



కార్యక్రమంలో పాల్గొన్న సైక్లిస్టులు

ఉత్సాహంగా 'సైక్లింగ్'

రాయదుర్గం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ అహ్మద్ నదీమ్, ఎం.భగవత్ ముఖ్య అతిథులుగా హాజరై సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, 35 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్‌ను పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

పీఎస్ఐఓ సెంటర్‌ను పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్ (పీఎస్ఐఓసీ)ను మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. కొత్తగా ప్రవేశపెట్టిన ట్రాఫిక్ ఉల్లంఘన యాప్ పనితీరు, ఈ-చలాన్ వ్యవస్థ, ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ నుంచి క్షేత్రస్థాయిలో సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తూ తీసుకునే నిర్ణయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ సమర్థవంతంగా ఉందని, రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చేపట్టేందుకు ఇలాంటి వ్యవస్థ పనితీరు ఎంతో కీలకమని ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జంప్ చేయకుండా ఉండాలని, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

ప్లాస్టిక్ కవర్‌లో పసికందు మృతదేహం

మియాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్ సమీపంలో రోడ్డు పక్కన పసికందు మృతదేహం లభ్యమైంది. గుర్తుతెలియని వ్యక్తులు పసికందు మృతదేహాన్ని రోడ్డుపక్కన ప్లాస్టిక్ కవర్‌లో పడేసి వెళ్లారు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న మియాపూర్ పోలీసులు పసికందు మృతిచెందినట్లు గుర్తించారు. చిన్నారి వయస్సు రెండు రోజులు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు



వివేకానందనగర్ కాలనీలో విజయదశమి ఉత్సవంలో పాల్గొన్న సంఘ్ సభ్యులు

ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వసంతోత్సవాలు

గచ్చిబౌలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శేరిలింగంపల్లి, ప్రశాంత్‌నగర్ బస్తీలో ఆదివారం ఘనంగా వేడుకలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సాహితీ విద్యాసంస్థల చైర్మన్ డీబీరావు, వనవాసి కల్యాణాశ్రమం ప్రాంత కోశాధికారి తాడేపల్లి హనుమంత్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశం ఎన్నో దాడులను ఎదుర్కొని తట్టుకొని నిలబడగలిగిందన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో దేశ ప్రజలు సమిష్టిగా పోరాడేందుకు 1925లో డాక్టర్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించారన్నారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఆర్ఎస్ఎస్ శత వసంతాలను పూర్తి చేసుకుందన్నారు. ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా మొదట సేవలో నిమగ్నమయ్యేది స్వయం సేవకులేనని వారు పేర్కొన్నారు. నాటి దివిసీమ ఉప్పెన, మొన్న వచ్చిన కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ సంఘ సేవా కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సేవ చేశారన్నారు.

వివేకానందనగర్‌లో..

హైదర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోసాల రామకృష్ణమాచార్యులు, మంగళంపల్ల శ్రీధర్ హాజరై మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి పాల్గొని ధ్వజ ప్రణామం చేశారు.





గుంతలమయంగా మారిన మంజీరా రోడ్డు

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిలో పేరుకుపోయిన బురద


అధ్వాన రోడ్లు.. ప్రయాణికుల ఇక్కట్లు

- ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలమయంగా మారిన రహదారులు
- పేరుకుపోయిన బురద, పైకి తేలిన కంకర
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

చందానగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శేరిలింగంపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం అనంతరం సైతం గుంతల రోడ్లు, రోడ్లపై పేరుకుపోయిన ఇసుక, పైకి తేలిన కంకరతో విసిగిపోతున్నారు. అడుగడుగునా గుంతలే కనిపిస్తున్నాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. దీంతో అరగంటలో చేరుకునే గమ్యస్థానానికి గంటకు పైగా సమయం పడుతుంది. గుంతల కారణంగా ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిలో ఇసుక, బురద పేరుకుపోవడంతో ద్విచక్రవాహనదారులు జారిపడుతున్నారు. చందానగర్ జాతీయ రహదారి నుంచి అమీన్‌పూర్ కమాన్ వరకు గల రోడ్డులో అడుగులోతు గుంతలు, తేలిన కంకరతో ప్రయాణం సాగించలేని దుస్థితి ఏర్పడింది.

అధ్వానంగా మెజార్టీ రహదారులు

చందానగర్ మంజీర రోడ్డు బీఆర్ గ్యాస్ ఏజెన్సీ నుంచి మైహోం అపార్ట్‌మెంట్స్ ప్రధాన ద్వారం వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ మిగిలిన చోట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియం వైపు వెళ్లే రహదారి హుడా కాలనీ సాయిబాబా దేవాలయం వరకు గుంతలతో అధ్వానంగా మారింది. శేరిలింగంపల్లి డివిజన్‌లోనూ పలు రోడ్లు నడవడానికి వీలులేకుండా ఉన్నాయి. మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్, చందానగర్, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.



గచ్చిబౌలిలో అధ్వానంగా ఉన్న రోడ్డు

తెలంగాణ పండుగలకు ఎంతో విశిష్టత

- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

రాయదుర్గం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పండుగలకు ఎంతో విశిష్టత ఉందని, అందులో బతుకమ్మ చాలా ప్రత్యేకమైనదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని జర్నలిస్ట్ కాలనీ ఫేజ్-3లో ఆదివారం జరిగిన బతుకమ్మ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జర్నలిస్ట్ కాలనీలోనే నివాసముంటున్న చిత్తూరు ఎంపీ బతుకమ్మ ఆటపాటలను తిలకించారు. గోపనపల్లిలోని జర్నలిస్ట్ కాలనీలో ఎంగిలిపూల బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కాలనీ ముఖద్వారం నుంచి మహిళలు బతుకమ్మలను తీసుకొని సొసైటీ కార్యాలయం వరకు చేరుకొని అక్కడ ఆటపాటలతో బతుకమ్మ ఆడారు. పెద్ద సంఖ్యలో మహిళలు, కాలనీవాసులు, మహిళా జర్నలిస్టులు బతుకమ్మలను పేర్చుకొని వచ్చారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు, సొసైటీ సభ్యులు రవీంద్రబాబు, లక్ష్మీనారాయణ, మహేశ్వర్, కమలాకర్‌చార్య, వేణుగోపాలరావు, హనుమంతరావు, వనజ, పద్మావతి, సరస్వతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం

- 360 బాటిళ్లను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రవాణా అవుతున్న అక్రమ మద్యంపై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.14.50 లక్షల విలువైన 360 బాటిళ్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న డీటీఎఫ్ ఎక్సైజ్ సీఐ పవన్‌కుమార్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ప్రవీణ్‌కుమార్‌లు అభినందించారు. స్వాధీనం చేసుకున్న మద్యం గోవా, హరియాణా, లక్నో ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ పోలీసులు

నేడు జంట సర్కిళ్లలో ప్రజావాణి

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో సోమవారం ప్రజావాణిని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని పరిశీలించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి) : క్విట్ ఇండియా పోరాటంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన స్వాతంత్య్ర సమరయోధుడు ప్రొఫెసర్ కొండాలక్ష్మణ్ బాపూజీ సేవలను మరువలేమని స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనాథ్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన యూత్ సభ్యులతో కలిసి లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నీలగిరి, తిమ్మయ్య, విజయ్, శ్రీధర్, రామచందర్,శేఖర్, అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతల నాగరాజు

కార్మికులకు అన్యాయం చేస్తే సహించం

● ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు చింతల నాగరాజు

జీడిమెట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ధర్మా కేబుల్ కంపెనీలో కార్మికులను 55 సంవత్సరాలకే రిటైర్మెంట్ చేస్తున్నారని యూనియన్ ఆధ్వర్యంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ శ్యామ్ సుందర్ రెడ్డి కార్యాలయంలో ఆ కంపెనీ హెచ్‌ఆర్ శ్రీకాంత్‌తో నాగరాజు సమావేశం ఏర్పాటు చేయించారు. 58 సంవత్సరాల సర్వీసు పూర్తయ్యాక రిటైర్ చేయాల్సి ఉండగా, కార్మికులకు అన్యాయం చేస్తూ 3 సంవత్సరాల ముందే 55 సంవత్సరాలకే ఎలా విధుల నుంచి తొలగిస్తున్నారని నాగరాజు నిలదీశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న విల్లాస్ వాసులు

'ఫాక్స్ సాగర్ రిటైనింగ్ వాల్‌కు మరమ్మతులు చేయించాలి'

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీరప్పనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే షాంగ్రిల్లా విల్లాస్ వాసులు ఎమ్మెల్యేను కలిసి ఇటీవల కురిసిన వర్షాలకు ఫాక్స్ సాగర్ రిటైనింగ్‌వాల్ పాక్షికంగా దెబ్బతిన్నదని, మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో విల్లాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ భార్గవ్ నారాయణ, చంద్రశేఖర్, బీరప్పనగర్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, కోశాధికారి మధు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆర్టిజన్ మృతి



రాంబాబు (ఫైల్)

జీడిమెట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న ఓ విద్యుత్ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డీపీ కాలనీలో నివాసముంటున్న బైరిశెట్టి రాంబాబు(43) జీడిమెట్ల ఎస్ఎస్-1లో ఆర్టిజన్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆదివారం సాయంత్రం షాపూర్‌నగర్‌లో విద్యుత్ సమస్య రావడంతో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. జీడిమెట్ల పోలీసులు రాంబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మదన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పరిశ్రమ కార్మికులు

కార్మికులకు న్యాయం జరిగేలా ఒప్పందం

షాపూర్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని రాశి ఎంటర్‌ప్రైజెస్ కార్మికులకు రెండోసారి ఒప్పందం (అగ్రిమెంట్) జరగడం సంతోషకరమని కార్మికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీఎస్ఐఐసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర కార్మిక నాయకుడు, పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు ముద్దాపురం మదన్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమమే తన ధ్యేయమని, ప్రతి కార్మికునికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. యాజమాన్యంపై రాజీలేని పోరాటం చేసి కార్మికులకు న్యాయం చేస్తామన్నారు. మొదటిసారి అగ్రిమెంట్‌లో రూ. 3వేలు పెంచగా, చేయగా, రెండవ అగ్రిమెంట్‌లో ఏకంగా 7 వేలు చేయడం విశేషం అన్నారు. కార్యక్రామానికి కార్మిక నాయకులు సాయన్నగౌడ్, భాను, శివ, ఎయిర్ ల్యాబ్స్ సెక్రటరీ నాగేందర్‌బాబు, గాంధీనగర్ జనరల్ సెక్రెటరీ దేవేందర్, వివిధ కంపెనీల కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



చెత్తను పరిశీలిస్తున్న అధికారులు, అసోసియేషన్ సభ్యులు

పారిశ్రామికవాడలో ఏ రోడ్డు చూసినా చెత్తమయం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామికవాడలో ఏ రోడ్డుపై చూసినా చెత్త దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక వాడ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిగౌడ్ , కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రోడ్లపై చెత్త పేరుకుపోతున్నదని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. కొత్త రోడ్ల నిర్మాణం, వర్షపు నీటి సమస్యను పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు అసోసియేషన్ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో అసోసి యేషన్ సభ్యులు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, ఫైలా అధికారి నజీర్, బాషా, గాంధీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు లక్ష్మీనాథ్, కార్తిక్, సతీష్, జగదీష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

దూకుడు పెంచిన హైడ్రా!

● కలెక్టర్ పరిశీలించి వెళ్లిన మర్నాడే కూల్చివేతలు ● వెంటనే చుట్టూ కంచె ఏర్పాటు

గాజులరామారం,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం హైడ్రా అధికారులు దూకుడు పెంచారు. ఆదివారం కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారంలోని ఏపీఎస్ఎఫ్‌సీ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడారు.

శుక్రవారం సాయంత్రం మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి స్వయంగా గాజులరామారంలో కబ్జాకు గురవుతున్న భూములను అధికారులతో కలిసి పరిశీలించి, అక్రమ నిర్మాణాల కూల్చివేతకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆదివారం తెల్లవారుజామునే హైడ్రా , రెవెన్యూ, జీహెచ్ఎంసీ, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు భారీ ఎత్తున గాజులరామారం చేరుకొని గాలిపోచమ్మబస్తీ, బాలయ్యబస్తీ, రాజారాజేంద్రబస్తీ, అబిద్‌బస్తీలపై విరుచుకుపడ్డారు. దాదాపు 275 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అడ్డుకోవడానికి యత్నించిన మహిళలు, రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.



ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు..

అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి అధికారులు రావడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హైడ్రా అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. 'బతుకమ్మ పండుగ రోజే మా బతుకులు బజారున పడ్డాయి' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా అంటే పేదలను కొట్టి పెద్దలను కాపాడటమా అని నిలదీశారు. లక్షల రూపాయలు పోసి ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుంటే ఇప్పుడు మీరు వచ్చి కూల్చివేస్తే మేం ఎక్కడికి పోవాలని వాపోయారు. ప్లాట్లు అమ్మిన వారు పత్తాలేకుండా పోయా రు, కొనుకునోళ్లం బలైతున్నామని కన్నీరుమున్నీరయ్యారు.

భారీ బందోబస్తు మధ్య...

గాజులరామారంలో ఆదివారం సాగిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఉద్రిక్తల మధ్య సాగాయి. భారీ పోలీస్‌బందో బస్తు మధ్య సాగిన ఈ కూల్చివేతలను స్థానిక మహిళలు అడ్డుకొని అధికారుల తీరుపై మండిపాడ కూల్చివేతలు చేస్తున్న జేసీబీలపైకి ఎక్కి తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఓ వ్యక్తి నానా హంగామా చేయగా, పోలీసులు అతడికి నచ్చచెప్పి కిందికి దించి తమ పని పూర్తి చేశారు.

వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు..

గతంలో మాదిరి కాకుండా అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన స్థలం మళ్లీ కబ్జా కాకుండా వెంటనే దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పని మొదలెట్టారు. మరో రెండు రోజులు ఈ పని ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, అధికారులు కూల్చివేయకుండా వదిలేసిన ఇళ్లలో ఉంటున్న వారిని త్వరలోనే ఖాళీ చేయించి స్వాధీనం చేసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలంగౌడ్

బతుకమ్మ పండుగనాడే రోడ్డున పడేశారు



పేదలు ఉంటున్న ఇళ్లను కూల్చివేసి మమ్మల్ని రోడ్డున పడేచారు. బతుకమ్మ పండుగ రోజు పస్తులు ఉండాల్సి వస్తోం ది. అందరూ సంబురాలు చేసుకుంటుంటే మాకేమో బాధపడే రోజు వచ్చింది. - నీలమ్మ, బాధితురాలు



తమ వస్తువుల వద్ద దిగాలుగా కూర్చున్న బాధితులు



ఫెన్సింగ్ కోసం గుంతలు తవ్వుతున్న సిబ్బంది



కొంపల్లి మున్సిపాలిటీ జయభేరీ రెసిడెన్సీ కాలనీలోని ప్రసన్న రెసిడెన్సీలో బతుకమ్మ సంబురాల్లో చిన్నారులు, మహిళలు



సూరారం వెంకట్‌రాంనగర్‌లోని బచ్‌పన్ ఒలింపియాడ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

కుత్బుల్లాపూర్‌జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో తొలిరోజైన ఆదివారం ఎంగిలి పూలు బతుకమ్మను మహిళలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మలను ఒకచోటకు చేర్చి పూజలు చేశారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆట పాటలతో సందడి చేశారు. పలు పాఠశాలలు, కళాశాలల్లోను బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయరాళ్లు విద్యార్థినులు కలిసి బతుకమ్మ ఆడారు.



త్రివేణి స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



కొంపల్లి మున్సిపల్‌లోని శివ శివానీ డిగ్రీ కళాశాలలో...



నిజాంపేట వార్డు ఆఫీస్ రోడ్డులో పిచ్చుక గూళ్లలా ఉన్న తీగలు



వాటర్ ట్యాంక్ రోడ్డులో ..



బండారి లేఅవుట్ రోడ్డులో కుప్పలుగా పడి ఉన్న తీగలు

పిచ్చుక గూళ్లలా కేబుల్, నెట్ వైర్లు

ప్రమాదాలు జరుగుతాయని భయపడుతున్న ప్రజలు

నిజాంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేబుల్, నెట్ తీగలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. నిజాంపేటలోని బండారి లేఅవుట్, పాత విలేజ్, వాటర్ ట్యాంక్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు భారీగా కేబుళ్లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ తీగలేవో, కేబుల్ తీగలేవో తెలియడం లేదు. ప్రతి స్తంభానికీ పిచ్చుక గూళ్ల మాదిరిగా తీగలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా, ఇటీవల విద్యుత్ అధికారులు కేబుళ్లను కట్ చేసి రోడ్డుపై పడేయడంతో కుప్పలుగా పేరుకుపోయాయి. పాదచారులు, వాహనదారులు అ టుగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే సంబంధిత అధికారులు స్పందిస్తారా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వెంటనే తొలగించాలి

అధికారులు తొలగించిన కేబుల్ వైర్లను సిబ్బంది నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ వదిలేయడంతో వాహనదారులకు, పాదచా రులు అవస్థలు పడుతున్నారు. గాజులరా మారం ప్రధానరహదారిలో తొలగించిన కేబుల్‌వైర్లను రోడ్డుపైనే పడేయడంతో ఈరోడ్డులో రాకపోకలు సాగించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. వైర్లు కాళ్లకు అడ్డుపడి పడిపోతున్నారు. తొలగించిన వైర్లను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

-షాపూర్‌నగర్,సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి)

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని హత్య చేసి మరో వ్యక్తిని గాయపర్చిన ఇద్దరు నిందితులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పడాల ఆనంద్, పడాల సుధాకర్‌లు కుటుంబ సభ్యులతో కలిసి షాపూర్‌నగర్‌లో నివాసముంటూ దూలపల్లిలోని స్టీల్ సిటీలో స్థలాన్ని కొనుగోలు చేసి షెడ్డు నిర్మించుకుని వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ వ్యాపారం చేస్తున్నారు. దూలపల్లికి చెందిన శ్రీకాంత్ గౌడ్ (హతుడు) ఇటీవల తనకు షెడ్డును స్థలంతోసహా విక్రయించాలని, అది కూడా తక్కువ ధరకే ఇవ్వాలని నిత్యం వేధిస్తున్నాడు. ఈనెల 18వ తేదీన శ్రీకాంత్ గౌడ్ తన స్నేహితులు రాజు, అలీతో పాటు మరో ఇద్దరు స్నేహితులతో షెడ్డుకు వద్దకు వెళ్లారు. స్థలాన్ని విక్రయించాలని దుర్భాషలాడటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పడాల ఆనంద్, పడాల సుధాకర్‌లు షెడ్డులోని రాడ్డులతో శ్రీకాంత్‌గౌడ్ తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలీకి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



కార్మికురాలికి పరిహారం చెక్కును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికురాలికి రూ.లక్ష పరిహారం ఇప్పించిన సీఐటీయూ

దుండిగల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ గతనెల 25న కాలు జారిపడి గాయపడి చికిత్స పొందుతున్న కార్మికురాలు పి.అనసూయ(47)కు సీఐటీయూ అండగా నిలించింది. కాంట్రాక్టర్‌తో రెండుసార్లు కార్మిక నాయకులు చర్చలు జరిపి బాధితురాలికి లక్ష రూపాయల నష్టపరిహారం ఇప్పించారు. ఈ సందర్భంగా దుండిగల్ మండల సీఐటీయూ కన్వీనర్ బొడిగె లింగస్వామి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఉన్న కార్మికులందరికీ సీఐటీయూ ఎర్ర జెండా ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్మికులతో పని చేయించుకుని జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిన పని ప్రదేశాలలో కార్మికులకు ప్రమాదాలు జరిగిన సందర్భంగా సీఐటీయూ అండగా ఉండి న్యాయం జరిగేందుకు కృషి చేస్తుందన్నారు. పరిశ్రమ యాజమాన్యాలు కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా కార్మికులందరికీ దసరా సందర్భంగా బోనస్ ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



నవోదయనగర్ రోడ్డులో విద్యుత్ లేకపోవడంతో వాహనాల వెలుతురులో నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు

విద్యుత్ సరఫరాలో అంతరాయంతో అవస్థలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని నవోదయనగర్, సంజీవయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మహిళలు వాహనాల లైట్ల వెలుగులో భయపడుతూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లడం కన్పించింది. రాత్రి పూట విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.